సాక్షి
కుమురం భీం

శనివారం : 30 : ఆగస్టు : 2025



గోదారమ్మ మహోగ్రరూపం

మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి ఎస్సారెస్పీలోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. 8లో▸



పత్తి రైతు పరేషాన్..!

భారీ వర్షాలు, వరదలు అన్నదాతను నిండా ముంచుతున్నాయి. పంట చేలల్లో వరద నీరు చేరడంతో పత్తి మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడనుంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.3 /25.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా మాజీ మంత్రి భీంరావు వర్ధంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిరిజన శాఖ మంత్రి దివంగత కోట్నాక భీంరావు 23వ వర్ధంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. భీంరావు విగ్రహానికి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా భీంరావు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. గిరిజన యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, వివిధ రాజకీయ పార్టీలు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వచ్చే నెల 22 నుంచి 'ఓపెన్' పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో సెప్టెంబర్ 22 నుంచి 28 వరకు ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మళ్లీ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మేజర్ పంచాయతీ మున్సిపాలిటీగా మారి 17 నెలలు గడిచినా కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు అందడం లేదన్నారు. ప్రభుత్వ సర్క్యులర్‌ను కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు మాట్ల రాజయ్య, కార్యదర్శి సమ్మయ్య, నాయకులు, కార్మికులు సంధ్య, పద్మ, ఇస్తారి, సాగర్, ప్రభాకర్, శంకర్, నగేశ్, లక్ష్మి, గణేశ్ పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని టాస్క్ కార్యాలయంలో ప్రముఖ టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అర్హత గల అభ్యర్థులు వివరాలు నమోదు చేసుకోవాలని టాస్క్ ఇన్‌చార్జి రాకేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జావా, పైతాన్, వెబ్ డెవలప్‌మెంట్, డేటా బేస్, సూడో కోడ్, సీ, సీ++, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్, అప్టిట్యూడ్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలో గల టాస్క్ కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 79897 33351 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పనిభారం తగ్గించాలని వీవోఏల ధర్నా



ధర్నా చేస్తున్న వీవోఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: పనిభారం తగ్గించడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఐకేపీ వీవోఏలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఐకేపీ వెలుగులో క్షేత్రస్థాయిలో గ్రామ సమైక్య సంఘం అసిస్టెంట్లతో 67 రకాల పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. విద్య బోధన, ట్రెనింగ్ పేరుతో ఇబ్బంది పెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాని కోరారు. అనంతరం డీఆర్‌డీఏ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షులు రోజా, కార్యదర్శి ధనరాజ్, నాయకులు అన్నపూర్ణ, అంకన్న, వనిత, సుమలత, వెంకటేశ్, సంతోష్, భరత్, హనుమంత్‌రావు, తిరుపతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పడిగాపులకు స్వస్తి..!

- నేరుగా ఖాతాల్లోకే పరిహారం నగదు
- వన్యప్రాణుల దాడులతో నష్టపోయిన రైతులకు వేగంగా సాయం
- గతంలో చెక్కుల రూపంలో అందజేత



కౌటాలలో పులిదాడిలో మృతి చెందిన ఎద్దును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు(ఫైల్)

కౌటాల(సిర్పూర్): పశువులపై వన్యప్రాణుల దాడులు పెరిగిన నేపథ్యంలో బాధిత రైతులకు సాయం వేగంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో పరిహారం చెక్కుల రూపంలో అందించగా, ఇక నుంచి పశుపోషకుల ఖాతాల్లోనే నేరుగా నగదు జమ చేయనుంది. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అనేక గ్రామాలు దట్టమైన అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్నాయి. అక్కడి ప్రజలు వన్యప్రాణులతోనే సహవాసం చేస్తున్నారు. ముఖ్యంగా మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా-అంధారీ అభయారణ్యాల నుంచి పెన్‌గంగ, ప్రాణహిత నదులు దాటి పెద్దపులులు కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోకి ప్రవేశిస్తున్నాయి. పెద్దపులులు, అడవి పందులు, ఎలుగు బంట్లు రైతులపై దాడులు చేస్తున్నాయి. వన్యప్రాణుల దాడుల్లో పశువులు, మేకలు కూడా మృత్యువాత పడుతున్నాయి.

వన్యప్రాణులకు ఆవాసం..

జిల్లాలో 1,78,939.73 హెక్టార్లలో అటవీప్రాంతం విస్తరించి ఉండగా, 1100 గ్రామాలు అడవుల మధ్యే ఉన్నాయి. బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), తిర్యాణి, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్ ప్రాంతాల్లో అన్నిరకాల వన్యప్రాణులు జీవనం సాగిస్తున్నాయి. ప్రాణహిత, వార్ధా నదులతోపాటు పెద్దవాగు పరీవాహక ప్రాంతాలను జింకలు, మెకాలు, దుప్పులు, కుందెలు, ఎలుగుబంట్లు, అడవి పందులు, సాంబార్లతోపాటు అనేక రకాల పక్షులు ఆవాసంగా మార్చుకున్నాయి.

పెరిగిన దాడులు

మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల వరకు పులుల సంచారం ఉంటోంది. పెన్‌గంగ, వార్ధా, ప్రాణహిత నదుల తీరాలు దాటి తిప్పేశ్వర్, తడోబా టైగర్ రిజర్వ్ పులుల అభయారణ్యాల నుంచి వలస వస్తుంటాయి. పదేళ్ల క్రితం పాల్గుణ అనే ఆడ పులి కాగజ్‌నగర్‌లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడంతో ప్రస్తుతం వాటి సంతతి పెరిగింది. బఫర్ ప్రాంతాల్లో పులులు సంచరిస్తున్న పులులు రైతులు, పశువులపై దాడులకు దిగుతున్నాయి. అటవీ ప్రాంతంలో నీటివనరులు తగ్గినప్పుడు ఇతర వన్యప్రాణులు కూడా గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. పశువులతో పాటు కాపరులపై కూడా అటవీ ప్రాంతంలో దాడి చేస్తున్నాయి. మనుషులు, వన్యప్రాణుల మధ్య ఘర్షణ వాతావరణం పెరిగింది. దీంతో జిల్లాలో పెద్దపులులను కొందరు హతమార్చారు. పంటలు కాపాడుకునేందుకు రైతులు విద్యుత్ తీగలు అమర్చడంతో విష ప్రయోగం చేస్తున్నారు. ఈ చర్యలను తగ్గించేందుకు ప్రభుత్వం వన్యప్రాణుల దాడుల్లో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు బాధితులకు వేగంగా పరిహారం అందిస్తుంది.

పరిహారం ఇలా..	వ్యక్తి మృతి చెందితే రూ.10 లక్షలు	తీవ్ర గాయాలైతే రూ.లక్ష వరకు..	పంటలకు నష్టం జరిగితే రూ.7,500 వరకు..
పశువులు చనిపోతే రూ.50 వేల వరకు..	పశువులు గాయపడితే పరిహారం ఉండదు.		

ఖాతాల్లోకి పరిహారం..

వన్యప్రాణుల బారినపడి మృత్యువాత పడిన పశువుల యజమానులకు పరిహారం చెల్లించే ప్రక్రియను అటవీ శాఖ వేగవంతం చేసింది. ఇకపై నేరుగా పోషకుల బ్యాంకు ఖాతాల్లోనే పరిహారం జమ చేస్తుంది. గతంలో బాధితులకు పరిహారాన్ని చెక్కుల రూపంలో ఇచ్చేవారు. దానికి రెండు వారాల సమయం పడుతుండగా ప్రస్తుత విధానంతో వారం రోజుల్లోనే నగదు అందుతుంది. రైతుల సమయం ఆదా కావడంతోపాటు అవినీతికి ఆస్కారం ఉండదని అధికారులు భావిస్తున్నారు. ముందుగా వన్యప్రాణులు పశువును చంపిన విషయాన్ని బాధితులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి. వారు ఘటనాస్థలికి వెళ్లి పంచనామా నిర్వహించి నివేదిక రూపొందిస్తారు. అలాగే రైతు వివరాలు, పశువైద్యుడి ధ్రువపత్రం, బ్యాంకు ఖాతా, తదితర సమాచారాన్ని మీ సేవ కేంద్రం ద్వారా నమోదు చేయించాలి. జిల్లా అధికారులు పరిశీలించి ఆమోదం తెలిపిన వెంటనే డబ్బులు యజమాని ఖాతాలో జమవుతాయి. జిల్లాలో గత రెండేళ్లలో 114 పశువులు వన్యప్రాణుల దాడుల్లో మృతి చెందాయి. అటవీశాఖ బాధితులకు రూ.50,35,434 పరిహారం అందించింది. వన్యప్రాణుల దాడుల్లో రెండేళ్లలో ముగ్గురు మృతి చెందగా బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున అందజేశారు. వన్యప్రాణుల దాడుల్లో ఎలాంటి నష్టం జరిగినా ఫిర్యాదు చేయాలని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు.

దరఖాస్తు చేస్తే వెంటనే..

వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తప్పవు. పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల దాడిలో పశువులు మృత్యువాత పడితే రైతులు నష్టపోకుండా ప్రభుత్వం పరిహారం పెంచింది. దీనిపై జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. పశువులు మృతి చెందితే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే విచారణ చేసి రూ.5వేలు తక్షణ సాయం అందిస్తాం. పరిహారం కోసం దరఖాస్తు చేసిన వారికి జాప్యం లేకుండా నేరుగా పశుపోషకుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తాం.

– సుశాంత్ బొగాడే, ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

ఎమ్మెల్యే ఫోన్ చేసినా స్పందించరా..?



వైద్యసిబ్బందిని నిలదీస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- వైద్య అధికారులు, సిబ్బందిపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం

ఆసిఫాబాద్‌అర్బన్: 'అత్యవసరంలో రోగులు ఆస్పత్రికి వస్తే అందుబాటులో ఉండరు. కనీసం ఎమ్మెల్యే ఫోన్ చేసినా లిఫ్ట్ చేయరా' అంటూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, డీఎంహెచ్‌వోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఓ గిరిజన గర్భిణి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు అదేరాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మహిళకు వైద్యం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెంటనే ఆస్పత్రి సూపరింటెండెంట్, డీఎంహెచ్‌వోకు ఫోన్ చేశారు. ఇద్దరూ స్పందించకపోవడంతో హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రజాప్రతినిధి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకుంటే, సామాన్యుల పరిస్థితి ఏంటని నిలదీశారు. మీ నంబర్ తనవద్ద లేదని సూపరింటెండెంట్ సమాధానం ఇచ్చారు. అనంతరం బాధితురాలిని మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. అయితే 108 వాహనంలో డీజిల్ లేకపోవడంతో ఎమ్మెల్యే సొంత డబ్బులతో డీజిల్ పోయించి గర్భిణిని మంచిర్యాలకు తరలించారు. ప్రస్తుతం గర్భిణి ఆరోగ్యం నిలకడగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అంబులెన్స్‌ల్లో ఇంధనం పోయించే స్థితిలో కూడా లేదని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. నాయకులు రవీందర్, కోవ సాయినాథ్ పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ సేవలు వెలకట్టలేనివి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్: క్రీడారంగంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా క్రీడా యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ క్రీడాస్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలో గిరిజన క్రీడాపాఠశాల ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా యువజన సేవల శాఖ ఇన్‌చార్జి అధికారి రమాదేవి, డీడబ్ల్యూవో భాస్కర్, ఏసీఎంవో ఉద్ధవ్, జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, రవి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టాలపై నివేదికలు రూపొందించాలి

ఆసిఫాబాద్: జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో కలిగిన నష్టాలపై పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూలై, ఆగస్టులో భారీ వర్షాలతో పంచాయతీరాజ్ రోడ్లు భవనాల శాఖల పరిధిలోని రహదారులు కోతకు గురయ్యాయని, కల్వర్టులు తెగిపోయాయని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల కాలువలకు గండ్లు పడ్డాయని, ప్రాథమిక అంచనా ప్రకారం 15 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, పశువులు, మేకలు, గొర్రెల ఫొటోలతో కూడిన వివరాలను అందించాలని ఆదేశించారు. బాధితులకు నష్టపరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అలింకో సంస్థ ద్వారా జిల్లాలో కృత్రిమ అవయవాలు, సహాయ ఉపకరణాలు అందించేందుకు 108 బాలబాలికలను ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కౌటాల, రెబ్బెన, కెరమెరి మండల్లోని కేంద్రాలు శిథిలావస్థకు చేరాయని, వాటిని ఇతర భవనాల్లోకి మార్చాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి సరిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

ఆసిఫాబాద్: జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శులు, ఏపీవోలు, ఏపీఎంలు, హౌజింగ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. భారీ వర్షాలతో పాఠశాలలు, పీహెచ్‌సీలు, ఉప కేంద్రాలు దెబ్బతిన్నాయని, వాటి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, హౌజింగ్ పీడీ వేణుగోపాల్, డీటీడీవో రమాదేవి పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు మోరేశ్వర్, కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు నిత్యం పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ఇతర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. 2019లో వచ్చిన మల్టీపర్పస్ విధానంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా వేతనాలు కూడా అందడం లేదన్నారు. సీఎం హామీ ఇచ్చినా కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. జీవో 51 సవరించాలని డిమాండ్ చేశారు. డీపీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. నాయకులు, కార్మికులు అనిల్, వసంత్, నగేష్, విలాస్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బెజ్జూర్(సిర్పూర్): విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ కాగజ్‌నగర్ డివిజన్ డిప్యూటీ ఇంజినీర్ నాగరాజు అన్నారు. మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలో శుక్రవారం పొలంబాట కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ సమస్యలు ఉంటే నేరుగా అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఏఈఈ అంజన్ కుమార్, ఎస్ఎల్ఏ ధర్మయ్య, లైన్‌మెన్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బోనస్‌కు ఎదురుచూపులే!



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు వదాయి శివరాం. రెబ్బెన మండలం నక్కలగూడకు చెందిన ఆయన గత యాసంగిలో 4.5 ఎకరాల్లో సన్నరకం వరిసాగు చేశాడు. అంతకు ముందు వానాకాలంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వచ్చింది. దీంతో యాసంగిలో పండిన 60 క్వింటాళ్ల ధాన్యాన్ని కూడా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాడు. అయితే ధాన్యానికి మాత్రమే మద్దతు ధర ప్రకారం డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాగా, బోనస్ మాత్రం ఇప్పటికీ అందలేదు. జిల్లాలో ఇది ఒక్క శివరాం పరిస్థితే కాదు. యాసంగిలో సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించిన వారందరూ బోనస్ కోసం ఎదురుచూస్తున్నారు.



దహెగాం మండలంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం(ఫైల్)

- రైతుల ఖాతాల్లో జమ కాని నగదు
- జిల్లాలో రూ.2.9 కోట్లు పెండింగ్
- నెలల తరబడి ఎదురుచూస్తున్న అన్నదాతలు
- ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో ఆందోళన

రెబ్బెన(ఆసిఫాబాద్): సన్నరకం వరి ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన జిల్లా రైతులు బోనస్ నగదు కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో వారిలో ఆశలు క్రమంగా సన్నగిల్లుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వరి ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు గత వానాకాలం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించింది. యాసంగిలో పండించిన ధాన్యానికి మాత్రం ఇప్పటివరకు చెల్లించలేదు. ధాన్యం అమ్మి నెలలు గడుస్తుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

5,800 మెట్రిక్ టన్నులు సేకరణ

జిల్లాలోలోని రైతులు యాసంగి సీజన్‌లో 24వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అధికారులు 5,800 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం సేకరించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. సర్కారుపై నమ్మకంతో చాలామంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే సన్నరకం ధాన్యాన్ని విక్రయించారు. విక్రయ సమయంలో అకాల వర్షాలు పడ్డాయి. తూకం చేసిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించకపోవడంతోనూ రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన పంటకు సంబంధించిన డబ్బులను మాత్రమే ఖాతాలో జమ చేసిన ప్రభుత్వం బోనస్‌ను విస్మరించింది. ఒక్కో రైతుకు వేలాది రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసి దాదాపు రెండున్నర నెలలు గడిచింది. చెల్లింపులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అన్నదాతల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

రూ.2.9 కోట్ల బకాయిలు

యాసంగిలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సన్నరకం ధాన్యాన్ని విక్రయించిన జిల్లా రైతులకు ప్రభుత్వం నుంచి బోనస్ రూపంలో రూ.2.9 కోట్లు రావాల్సి ఉంది. అకాల వర్షాలు, ధాన్యం కొనుగోలులో అధికారుల జాప్యాన్ని దృష్టిలో పెట్టుకుని చాలామంది ప్రైవేటుకే అమ్ముకున్నారు. అయితే ప్రైవేటులో రోజురోజుకూ ధర తగ్గించడం, ప్రభుత్వ కేంద్రాల్లో మద్దతు ధరతోపాటు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ వస్తుందనే ఆశతో మళ్లీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై మొగ్గు చూపారు. జిల్లావ్యాప్తంగా 12,090 మంది రైతులు సుమారు 5,800 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. అధికారులు యాసంగిలో బోనస్ చెల్లింపునకు 12,090 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. కేవలం కొనుగోలు చేసిన ధాన్యానికి మాత్రమే డబ్బులను జమ చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వం బోనస్ డబ్బులు చెల్లిస్తే వానాకాలం పంటల సాగుకు ఉపయోగపడతాయని రైతులు ఆశగా ఎదురుచూశారు. మరో రెండున్నర నెలల్లో వానాకాలం పంటల దిగుబడి సైతం చేతికి అందనుంది. ప్రభుత్వంపై ఆశతో వానాకాలంలోనూ అధికంగా సన్నరకాలనే సాగు చేశారు. ధాన్యం చేతికందేలోగా బోనస్ రాకపోతే రైతులు మళ్లీ ప్రైవేటు వ్యాపారులకే ధాన్యం విక్రయించాలని భావిస్తున్నారు.

ప్రైవేటుకు వద్దనుకుని..



గత యాసంగిలో ఐదెకరాల్లో మొత్తం సన్నరకం ధాన్యాన్నే పండించిన. తేమతో సంబంధం లేకుండా వడ్లు కొనేందుకు ప్రైవేటు వ్యక్తులు కల్లం వద్దకే రావడంతో 20 క్వింటాళ్ల వరకు ప్రైవేటుకే అమ్మిన. ప్రభుత్వం సన్నరకానికి బోనస్ కూడా ఇస్తుండటంతో ప్రైవేటుకు వద్దనుకుని మిగిలిన 50 క్వింటాళ్లను కొనుగోలు కేంద్రంలో విక్రయించిన. ధాన్యం డబ్బులు పడ్డయి.. కానీ బోనస్ మాత్రం అందలేదు.

– వదాయి కాంతారావు

సాగుకు ఉపయోగపడేవి



రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి ఇస్తామన్న బోనస్ డబ్బులు అందిస్తే వానాకాలం పంటల సాగుకు ఉపయోగపడేవి. ధాన్యం విక్రయించి దాదాపు మూడు నెలలు అయితంది. ఇప్పటివరకు డబ్బులు మాత్రం పడలేదు. పైసల కోసం వారానికి ఒకసారి బ్యాంకుకు వెళ్లి ఖాతా చూసుకోవాల్సి వస్తోంది. కనీసం ఎప్పుడు పడతాయో కూడా చెప్పడం లేదు.

– కొట్రంగి హన్మంతు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: పీఎంశ్రీ నవోదయ విద్యాలయంలో 2026–2027 విద్యాసంవత్సరంలో 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కాగజ్‌నగర్ నవోదయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు తొమ్మిదో తరగతిలో, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశాలకు సెప్టెంబర్ 23లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశాల కోసం https://cbseitms. nic. in/2025/ nvsix–9, 11వ తరగతిలో ప్రవేశాల కోసం https://cbseitms. nic. in/2025/ nvsxi–11లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కజ్జర్ల శివారులో చిరుత సంచారం



కజ్జర్ల శివారులో చిరుత పాదముద్రలు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల, దేవాపూర్ శివారులో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. పంట పొలాలకు వెళ్లే రైతులకు చిరుత పాదముద్రలు కనిపించడంతో వారు పెద్దపులివిగా భావించి భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ కృష్ణను సంప్రదించగా అవి చిరుతపులి అడుగులుగా గుర్తించారు. కజ్జర్ల, దేవాపూర్ శివారులో అటవీ ప్రాంతం నుంచి చిరుతపులులు వచ్చి వెళ్తున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవి ఒకే చోట ఉండవని పేర్కొన్నారు. చిరుతపులి ఎవరికైనా కనిపిస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వేటగాళ్ల అరెస్ట్

సాత్నాల: భోరజ్ మండలం గిమ్మ గ్రామ సమీపంలో నాటు తుపాకీతో నాలుగు నెమళ్లు, ఒక కృష్ణ జింకను వేటాడి కాల్చి చంపిన మహారాష్ట్రలోని పార్వకు చెందిన రాథోడ్ సందీప్, రాథోడ్ యోగేశ్‌ను ఫారెస్ట్ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాటు తుపాకీ, కత్తి, వల స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్ తెలిపారు. ఎఫ్ఎస్వో హైదల్ ఖాన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సాయి, అమర్ తదితరులున్నారు.

నలుగురికి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన బోనాల రాజేశ్వర్‌కు సంబంధించిన ఆరు పందులను దొంగిలించిన నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన అల్లకుంట సంతోష్, దాండ్ల జనార్దన్, అల్లకుంట రాజేశ్, న్యూహౌసింగ్‌బోర్డుకు చెందిన రాకేశ్ ఈనెల 23న బొక్కల్‌గూడలో ఆరు పందులను దొంగిలించినట్లు పేర్కొన్నారు. వాటిని న్యూహౌసింగ్‌బోర్డులో దాచిపెట్టినట్లు తెలిపారు. మరోసారి చోరీకి యత్నించగా శుక్రవారం వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. విచారించగా చోరీకి పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి ఐదు పందులు రికవరీ చేశారు. కాగా, వారు ఒక పందిని వధించి తిన్నట్లు సీఐ పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ కేర్ టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 8985114453, 9391036931 [HA-16135]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

గోదారమ్మ మహోగ్రరూపం

- బాసర గుడి సమీపానికి జలం
- మునిగిన లాడ్జీలు, దుకాణాలు
- పంట పొలాల్లో నిలిచిన నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు
- 1983 తర్వాత మరోసారి వరద

బాసర: మూడు రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి ఎస్సారెస్పీలోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో గోదావరినది ఉప్పొంగి ప్రవహిస్తోంది. బాసరలోని హరిహర కాటేజీలో జలదిగ్బంధంలో చిక్కుకున్న రెండు కుటుంబాలకు చెందిన 11 మందిని రెవెన్యూ, పోలీస్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు బయటకు తీసుకువచ్చారు. బ్రిడ్జికి 10 ఫీట్ల కింది నుంచి ప్రవహిస్తూ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గోదావరి బ్యాక్ వాటర్‌తో పంట పొలాలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. గోదావరి ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి. బాసర రైల్వే స్టేషన్, శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయ సమీపం వరకు నదీ జలాలు వచ్చాయి. సమీప గ్రామాల ప్రజలు



ఆలయ సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

భయాందోళనకు లోనయ్యారు. నదీ ప్రవాహంతో పలు రోడ్లు జలమయం కావడంతో బాసర నుంచి పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా సోయా, పత్తి, వరి పంటలు నీటమునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆయా కాలనీల్లో వైద్యసేవలు

భారీ వర్షాల నేపథ్యంలో బాసరలోని పలు కాలనీలు అపరిశుభ్రంగా మారాయి. వరదనీటితో ఆయా కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ముందు జాగ్రత్తగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ ఆశాలత, ఏఎస్ఎం, సిబ్బందితో ఇంటింటా తిరిగారు. విష జ్వరాలు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సేవలందిస్తున్నారు. అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు.



బిద్రెల్లి–టాక్లీ మధ్య ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ఆలయంలో శాంతిపూజలు



శాంతిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

భారీ వర్షాలకు బాసర శ్రీజ్ఞాన సరస్వతీ కొలువుదీరిన క్షేత్రంలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ఆలయ వైదిక బృందం సభ్యులు గోదావరి తల్లికి శాంతిపూజ, సౌభాగ్య ద్రవ్య సమర్పణ నిర్వహించారు. రాష్ట్రంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ, పంట నష్టం జరగకుండా రాష్ట్ర ప్రజలందరినీ క్షేమంగా కాపాడాలని ఈ సందర్భంగా అమ్మవారిని వేడుకున్నట్లు సంజీవ్ పూజారి తెలిపారు.

నిలిచిన రైళ్ల రాకపోకలు



రైల్వే ట్రాక్ పక్కన నిలిచిన నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

బాసరలో గోదావరి నదికి వరదనీరు పోటెత్తింది. గోదావరినదిపై ఉన్న రైల్వే బ్రిడ్జికి రెండు ఫీట్ల కింది నుంచే నీళ్ల ప్రవహిస్తుండడంతో ఆ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైళ్ల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు బాసర స్టేషన్ మేనేజర్ రవీందర్ తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

బాసర ఎస్బీఐలోకి చేరిన నీరు

గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ బాసర మండల కేంద్రంలోని ఎస్బీఐలోకి చేరింది. మేనేజర్ అశోక్‌కుమార్, అధికారులు అప్రమత్తమై వరద నీటిని బయటికి తీసేందుకు ప్రయత్నం చేశారు. రెండు, మూడు రోజులు సేవలకు అంతరాయం కలగవచ్చని వారు తెలిపారు. సహకరించాలని ఖాతాదారులను కోరారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

వరద ముంపునకు గురైన బాసర మండంలోని ఓనీ, కౌటా, సావర్గం, సాలాపూర్, బిద్రెల్లి, లాబ్ది, టాక్లి గ్రామాలను ఎస్పీ జానకీ షర్మిల శుక్రవారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. వరద ప్రవాహం ఉన్నచోట చెరువులు, కుంటలు, వాగులు వద్దకు వెళ్లొద్దని అప్రమత్తం చేశారు. స్థానిక తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ ఎప్పటికప్పుడు వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటిస్తూ ప్రజలకు తగిన సూచనలు చేస్తున్నారు.



బాధితులను తీసుకువస్తున్న పోలీసులు



తెప్పెలపై బాధితులతో వస్తున్న గజ ఈతగాళ్లు

‘గడ్డెన్నవాగు’కు తగ్గని వరద

- ఐదు గేట్ల ద్వారా నీటి విడుదల



గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి శుక్రవారం భారీగా వరదనీరు చేరింది. ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు రెండు రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతూనే ఉంది. ఉదయం 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, రెండు, మూడు గేట్ల ద్వారా సుమారు 20 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నానికి ఇన్‌ఫ్లో మరింత పెరగడంతో మరో రెండు గేట్లు ఎత్తి 37వేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. వరద గేట్లకు దిగువ ప్రాంతంలోగల గణేశ్‌నగర్ కోతి హనుమాన్ ప్రాంతంలో కుభీర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా నీట మునిగింది. అటువైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఆటోనగర్‌తోపాటు రాహుల్‌నగర్‌లోని డబ్బా కాలనీ, భాగ్యనగర్‌లోకి వరదనీరు చొచ్చుకువచ్చింది. దీంతో అధికారులు ముందస్తుగా ఆయా కాలనీవాసులను పునరావాస కేంద్రానికి తరలించారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఒక గేటు మూసివేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 358.20 మీటర్ల నీటిమట్టం కొనసాగిస్తూ నాలుగు గేట్ల ద్వారా 30వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

‘కడెం’కు తగ్గిన వరద

కడెం: భారీ వర్షాలతో రెండురోజులుగా కడెం ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. శుక్రవారం ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో వరద గేట్లు మూసివేశారు. రాత్రి 6,670 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.400 అడుగుల నీటిమట్టం ఉందని వెల్లడించారు.

క్రీడాకారులే నిర్ణేతలుగా..

- చిన్న వయస్సులోనే స్టేట్ రెఫరీలుగా..
- ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఆదిలాబాద్: 19 ఏళ్ల వయస్సులో క్రీడల్లో రాష్ట్రస్థాయి వేదికల్లో పతకాలు సాధిస్తే వారి గురించి గొప్పగా చెబుతుంటాం. డిగ్రీ స్థాయిలో క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకుని సత్తా చాటితే వారికి గొప్ప భవిష్యత్ ఉంటుందని అంచనా వేస్తాం. అయితే ఈ క్రీడాకారులు మాత్రం నైపుణ్యాలను అలవర్చుకోవడమే కాకుండా ఆ క్రీడపై పట్టు సాధించి అతి చిన్న వయస్సులోనే న్యాయ నిర్ణేతలుగా ఎంపిక కావడం విశేషం. మహబూబ్‌నగర్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వారు రిఫరీలుగా వ్యవహరించనున్నారు. టీసీజీలోనే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ రెఫరీలుగా ఎంపికైన ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులపై కథనం.

ఆల్ రౌండర్‌గా వసంత



నిర్మల్ జిల్లాలోని కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన చిక్కుడు చిన్నక్క–చిన్నయ్య దంపతుల కుమార్తె వసంత రాష్ట్రస్థాయి వేదికల్లో అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతూ రాష్ట్రస్థాయి రిఫరీగా ఎంపికైంది. ట్రిపుల్ జంప్‌లో ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలో ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్య పతకంతో మెరిసింది. ఒక స్వర్ణం, మరో కాంస్యంతో సత్తా చాటింది. షాట్ పుట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. హైజంప్‌లో రెండు కాంస్యాలతో ప్రతిభ కనబరిచింది. దాదాపు అన్ని ఈవెంట్‌లలో ఆల్ రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించింది. మహబూబ్‌నగర్ వేదికగా ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎంపికైంది.

డిస్కస్ త్రోలో జ్యోతి



ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలానికి చెందిన బిస్సే సుధామ–అనసూయ దంపతుల కుమార్తె జ్యోతి ప్రస్తుతం జిల్లా కేంద్రంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. జ్యోతి డిస్కస్‌త్రోలో సత్తా చాటుతోంది. రాష్ట్రస్థాయి వేదికల్లో ఇప్పటివరకు రెండు రజత పతకాలు, ఓ కాంస్య పతకంతో సత్తా చాటింది. ఓవైపు ఓ అథ్లెట్‌గా రాణిస్తూనే అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ వేదికగా మే 16నుంచి 30వరకు నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించింది. కొద్దిరోజులుగా జిల్లాలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా స్థాయి టెక్నికల్ అఫీషియల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఇప్పుడు మహబూబ్‌నగర్ వేదికగా ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎంపికైంది. కాల్ రూమ్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించనుంది.

జంప్స్ రెఫరీగా అనిల్



ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం మంజరామ్ తండాకు చెందిన అజాడే శారదాబాయి–గురుదయాల్ సింగ్ దంపతుల కుమారుడు అనిల్ ప్రస్తుతం జిల్లా కేంద్రంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. రాష్ట్రస్థాయిలో ఇప్పటివరకు స్టీపుల్ చేజ్, హ్యామర్ త్రోలో కాంస్య పతకాలతో మెరిశాడు. ట్రిపుల్ జంప్‌లో రజత పతకంతో సత్తా చాటాడు. మేలో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో అర్హత సాధించాడు. తాజాగా మహబూబ్‌నగర్ వేదికగా నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంపు ఈవెంట్‌లో న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నాడు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



సతీశ్ (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని ‘ఏ’ జోన్ రాంనగర్ ప్రాంతానికి చెందిన చీపురుశెట్టి సతీశ్ (40) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఏఎస్సై వెంకన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాల కారణంగా సతీశ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెంబిలో మరొకరు..

పెంబి: మానసిక స్థితి బాగా లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అందె రమేశ్ (40)కు కొంతకాలంగా మానసిక స్థితి బాగా లేదు. కుటుంబ సభ్యులు కొద్దిరోజుల క్రితం బెల్లంపల్లిలో చర్చికి తీసుకెళ్లి ప్రార్థన చేయించారు. అనంతరం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా ఎవరికీ చెప్పకుండా ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని అటవీప్రాంతంలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య భాగ్య, ఇద్దరు కొడుకులున్నారు. పెద్ద కొడుకు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సద్గురు బోధనలు అనుసరణీయం

- నేడు పూలాజీ బాబా జయంతి
- భారీగా తరలిరానున్న భక్తులు

జైనూర్: తన హితబోధతో ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సద్గురు పూలాజీ బాబా. మహారాష్ట్రలోని పర్భని జిల్లా, నాగ్‌నాథ్ ఔండా తాలుకాలోని బయాన్‌రావు గ్రామంలో 30 ఆగస్టు 1925లో ఆంద్ తెగలోని నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన ధోండిజి ఇంగ్లే–పుంజాబాయి పుణ్య దంపతులకు బాబా జన్మించారు. తల్లి పుంజాబాయి గొప్ప శివభక్తురాలు, భజన, సత్సంగ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. చిన్న వయస్సులోనే పూలాజీబాబా తండ్రి కరువు కాటకాల నుంచి తప్పించుకుని బతుకుదెరువు కోసం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పట్నాపూర్ ఆంద్‌గూడ గ్రామానికి 1947లో శాశ్వతంగా వలస వచ్చారు. వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించారు. తల్లి పుంజాబాయి, గురువు గణపతి వాడ్గురే బోధనలతో ప్రభావితమైన పంచాగ్ని యోగా సాధనతో పాటు వేదాలు, ఉపనిషత్తులు ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి పూలాజీ బాబా పరమయోగిగా మారారు.

బాబా తత్వమిదే..

‘అనంత విశ్వంలో మనమున్నాం. మనలో విశ్వం దాగి ఉంది. పంచభూతాల నిలయం మానవ దేహం. ఈ దేహమే దేవాలయం. శరీరంలోని కుండలి, శక్తిని ఉత్తేజితం చేయడంతో భక్త సాక్షాత్కారం లభించి ప్రశాంత జీవితం పొందగలరు’ అని ఆయన బోధించారు. జీవుడే దేవుడు అంటూ భక్తుల మానసిక వికాసానికి జీవితాంతం కృషి చేసి గురుపీఠం గౌరవాన్ని పెంచిన పరమ యోగి శ్రీసిద్ధి యోగా పీఠం, సిద్ధేశ్వర సంస్థాన్‌ను నెలకొల్పారు.



పూలాజీబాబా (ఫైల్)

12 ఏళ్లు తపస్సు చేసి..

మల్లంగి తపోభూమిలో 12 ఏళ్లు బాబా తపస్సు చేశారు. మల్లంగి అరణ్య ప్రదేశం దట్టమైన వృక్షాల నడుమ ఓ నదీ తీర ప్రాంతంలో అల్లనేరేడు వృక్షం కింద తపస్సు చేసేవారు. ఈ క్షేత్రం నేడు సిద్ధేశ్వర సంస్థాన్ మల్లంగిగా పిలువబడుతోంది. బాబా ఇక్కడే ధ్యానధారణ చేసేవారు. పూలాజీ బాబాకు 1965–66లో ఆత్మసాక్షాత్కారం అయింది.

వేడుకలకు ఇతర రాష్ట్రాల నుంచి..

జైనూర్ మండలంలోని పట్నాపూర్ శనివారం నిర్వహించనున్న పూలాజీ బాబా జయంతి వేడుకలకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు సిద్ధేశ్వర సంస్థాన్‌కు తరలిరానున్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కిన్వట్ ఎమ్మెల్యే భీంరావు కేరామ్ తదితరులు హాజరుకానున్నారు.

ఆత్మ విశ్వాసాన్ని నింపిన బోధనలు

బాబా బోధనలు ఎందరిలోనో ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. అనేక మంది జీవితాలు ఇతరులకు ఆదర్శమయ్యాయి. బాబాను విమర్శించే వారు అతడి పాదక్రాంతులయ్యారు. బాబా భక్తులు నేటికీ అతడు చూపిన మార్గంలో జీవిస్తూ ఆయా గ్రామాల్లో ధ్యాన కేంద్రాలు నెలకొల్పారు. మూఢ నమ్మకాలకు స్వస్తి పలికి సత్ప్రవర్తనను అలవర్చుకున్నారు. పూలాజీ బాబా హితబోధతో ఎంతోమంది జీవితాలు మారాయి. నేటికీ బాబా చూపిన మార్గంలో భక్తులు మాంసాహారం, మద్యానికి దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు 16 ఏళ్ల జైలు

మంచిర్యాలక్రైం: భార్య మృతికి కారణమైన భర్తకు 16 ఏళ్ల జైలు శిక్ష, రూ.21 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి వీరయ్య శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు స్థానిక ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ రాంపూర్‌కు చెందిన గరిగంటి కుమారస్వామి సోదరి పుష్పలతకు ఐబీ తాండూర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన సిగ్గార్ శుభ్రాత్‌తో 2019 మార్చి 16న వివాహమైంది. వారు మంచిర్యాలలోని చున్నంబట్టి వాడలోని శ్రీసాయి కాలనీలో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా పుష్పలతను అదనపు కట్నం కోసం భర్తతో పాటు కుటుంబ సభ్యులైన ఐబీ తాండూర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన రాస్మాన్ సిగ్గార్, తులసి, అరికళ రమేశ్, మ్యారేజ్ బ్యూరోకు చెందిన భూతం భూమయ్య, శీలం సంజీవ్ తరచూ వేధిస్తున్నారు. పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా పద్ధతి మార్చుకోకుండా శారీరకంగా, మానసికంగా హింసించారు. వేధింపులు భరించలేక మనస్తాపం చెందిన పుష్పలత పురుగుల మందు తాగి 2019 డిసెంబర్ 23న ఆత్మహత్య చేసుకుంది. భర్త శుభ్రాత్, కుటుంబ సభ్యుల వేధింపులతోనే పుష్పలత ఆత్మహత్య చేసుకుందని మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో తమ్ముడు కుమారస్వామి ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజమౌళిగౌడ్ కేసు నమోదు చేశారు. సాంకేతిక సాక్ష్యాధారాలతో నిందితులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్య శ్రీలత సాక్షులను విచారించగా, శుభ్రాత్‌పై నేరం రుజువైంది. దీంతో జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న రాస్మన్, తులసి, రమేశ్, భూమయ్య, సంజీవ్‌పై నేరం రుజువు కాలేదని తెలిపారు.

కలెక్టర్ కార్యాలయ ఉద్యోగిపై ఫిర్యాదు

రెబ్బెన: తన భార్య మిస్సింగ్‌కు కలెక్టరేట్ ఉద్యోగి కారణమని శుక్రవారం ఆమె భర్త స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అల్లూరి మమతకు ఆసిఫాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి రమేశ్‌తో 24 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఈనెల 25న మమత రెబ్బెనలోని తన పుట్టింటి నుంచి వెళ్లగా ఇప్పటివరకు ఆచూకీ దొరకలేదు. దీంతో రమేశ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మమత తల్లి లీలను రమేశ్ సంప్రదించగా పొంతన లేని సమాధానం చెప్పింది. దీంతో లీలను విచారించి తన భార్యను తనకు అప్పగించి న్యాయం చేయాలని రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య మిస్సింగ్‌కు కలెక్టరేట్ ఉద్యోగి కారణమని ఆరోపించాడు. ఈ విషయమై ఎస్సై చంద్రశేఖర్‌ను సంప్రదించగా.. మమత మిస్సింగ్‌పై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే.. మమత మిస్సింగ్ కాలేదని, ఆమె క్షేమంగా ఉన్నట్లు సమాచారం ఉందన్నారు.

మృతదేహానికి రెండుసార్లు ఖననం

దిలావర్‌పూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన సాధ ఆశీర్వాదం అనే 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని 20 రోజుల వ్యవధిలో రెండుసార్లు ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాలు.. ఆశీర్వాదం 20 రోజుల క్రితం మరణించాడు. అదేరోజు క్రైస్తవ సంప్రదాయం ప్రకారం గ్రామానికి ఆనుకుని ఉన్న కాలువ పక్కనున్న వారి శ్మశాన వాటికలో ఖననం చేశారు. కాగా, నాలుగైదురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలువలు, చెరువులు ఉప్పొంగి ప్రవహించాయి. ఆశీర్వాదం మృతదేహం ఖననం చేసిన ప్రాంతం కోతకు గురైంది. దీంతో ఆశీర్వాదం మృతదేహం వరదలో కొట్టుకువచ్చి పెద్ద చెరువు ప్రాంతానికి చేరింది. గమనించిన గ్రామస్తులు ఎస్సై రవీందర్‌కు గుర్తు తెలియని మృతదేహంగా భావించి ఫిర్యాదు చేశారు. గ్రామస్తుంతా అక్కడకు వెళ్లి పరిశీలించగా 20రోజుల క్రితం ఖననం చేసిన ఆశీర్వాదం మృతదేహంగా గుర్తించారు. దీంతో ఆ మృతదేహాన్ని వారి కుటుంబీకులకు అప్పగించగా మరోసారి ఖననం చేశారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

మంచిర్యాలటౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కొర్రం శ్రీదేవి మంచిర్యాల మాతాశిశు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చిన్నమాలిని కోసిని సబ్ సెంటర్‌లో కుర్రం శ్రీదేవికి ఈ నెల 27వ తేదీన ఐదో కానుపు ప్రసవం కాగా, రక్తస్రావం ఎక్కువైంది. బీపీ డౌన్ కావడంతో అక్కడే చికిత్స అందించినా పరిస్థితి విషమించింది. దీంతో అదేరోజు మంచిర్యాలలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రానికి తరలించారు. బాలింతను కాపాడేందుకు ఎంసీహెచ్ వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేక ఆమె మృతి చెందినట్లు సూపరింటెండెంట్ హరీశ్చంద్రారెడ్డి తెలిపారు.

రిమ్స్‌లో మరొకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా బొందిడికి చెందిన కేంద్రె ఆకాశ్ (30) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మద్యానికి బానిసైన ఆయన జీవితంపై విరక్తి చెంది ఈనెల 27న పురుగుల మందు తాగినట్లు పేర్కొన్నారు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించారు.